క్లుప్తంగా

నరసింహం చౌదరిని పరామర్శించిన దద్దాల



నరసింహం చౌదరిని పరామర్శిస్తున్న దద్దాల నారాయణయాదవ్

పీసీపల్లి: మండలంలోని వెంగళాయపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యేరువ నరసింహం చౌదరి ఇటీవల బైక్ ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ నేపథ్యంలో పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ నరసింహంను పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం, ఓకేరెడ్డి, పోలు జయరామిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ శీలం సుదర్శనం, భూమిరెడ్డి కొండారెడ్డి, పరిమి వెంకట్రావు, యర్రంరెడ్డి మోహన్ రెడ్డి, పరుచూరి రమేష్, మూలే రాజశేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆది శైవ బ్రాహ్మణ సంఘ కార్యదర్శిగా రాఘవేంద్రశర్మ



సర్టిఫికెట్, మెమెంటో అందుకుంటున్న రాఘవేంద్రశర్మ

కొండపి (సింగరాయకొండ): మండలంలోని కె.ఉప్పలపాడుకు చెందిన ఎస్ రాఘవేంద్రశర్మ ఆది శైవ (అర్చక)సంఘం జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఆదివారం ఒంగోలులోని హరిప్రియ ఫంక్షన్ హాల్లో ఆది శైవ బ్రాహ్మణ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్ రాఘవేంద్ర శర్మను జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

ఎస్సై సుమన్‌ను కలిసిన నేతలు



ఎస్సైకి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీఎస్‌పురం(పామూరు): ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.సుమన్‌ను ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ మండల నాయకులు ముత్యాల నారాయణరెడ్డి, భూమిరెడ్డి వెంకటరెడ్డి పలువురు కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్సైని కలిసిన వారిలో గూడపురెడ్డి రమణారెడ్డి, ముత్యాల రమణారెడ్డి, సన్నపురెడ్డి శివారెడ్డి, పెద్దిరెడ్డి రామిరెడ్డి, డబల్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, మునగల నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 30 పోలీస్ యాక్టు



ఎస్సై మధుసూదన్‌రావు

వెలిగండ్ల: మండలంలో సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్టు అమల్లో ఉంటుందని ఎస్సై మధుసూదనరావు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రజలు సహకరించాలన్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు పశువులను రోడ్లపై వదలకూడదన్నారు. పశువుల యజమానులు తమ పశువులను కాపాడుకోవడమే కాకుండా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

సాత్విక్‌రెడ్డి మృతదేహానికి నివాళి




సాత్విక్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తిరుపతిరెడ్డి

వెలిగండ్ల: మండలంలోని రామలింగాపురం సర్పంచ్ గజ్జల నాగేశ్వరరావు మనుమడు సాత్విక్‌రెడ్డి మృతదేహానికి ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వై నాగూర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల వెంకటరెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా నాయకులు గజ్జల తిరుపతిరెడ్డి, నాయకులు కుప్పనబోయిన వెంకట్రామయ్య, బొబ్బా వెంకటరెడ్డి, రాగిపిండి కృష్ణారెడ్డి, టి. నాని మృతదేహానికి నివాళులర్పించారు.

పేదల విద్యపై ఎందుకంత కక్ష..?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, పేద పిల్లలకు ఉన్నత చదువులు అందించాలన్న మహోన్నత లక్ష్యంతో కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పేద పిల్లల జీవితాలతో ఆటలాడటం ప్రారంభించింది. రోజుకో నిర్ణయం తీసుకుంటూ విద్యా వ్యవస్థలోని అనేక పథకాలను రద్దు చేస్తూ గందరగోళం సృష్టిస్తోంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో పేద విద్యార్థుల.. వారి తల్లిదండ్రుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

- సీబీఎస్ఈ సిలబస్ బోధన రద్దుతో వెల్లువెత్తుతున్న ఆగ్రహం
- ప్రభుత్వం తీరుపై మండిపడుతున్న విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు
- నియోజకవర్గంలో 1200 మంది విద్యార్థులకు ఎసరు



మోడల్ స్కూల్ కనిగిరి



పాఠశాలల్లోని విద్యార్థులు

కనిగిరి రూరల్: గత ప్రభుత్వం సర్కారు బడుల్లో సీబీఎస్ఈ పాఠాలు బోధనలకు శ్రీకారం చుట్టింది. చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిషత్ ఉంటుందని, వారి కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతాయనే ఉన్నత లక్ష్యం, ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేశారు. అందులో భాగంగానే నాడు- నేడు కింద పాఠశాలల్లో అనేక మౌలిక వసతులను కల్పించారు. డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్‌ను ప్రభుత్వ బడుల్లో బోధించేందుకు చర్యలు చేపట్టింది. దీంతో పేద బడుగు, బలహీన వర్గాల తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తం చేశారు. ఆ ఆనందాన్ని కూటమి ప్రభుత్వం మూన్నాళ్ల ముచ్చటగా మార్చింది. ×పేదోడి బిడ్డకు పెద్ద చదువా×... అన్న చందంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉన్న సీబీఎస్ఈ విధానాన్ని రద్దు చేసింది. ఈమేరకు ఈ ఏడాది నిర్వహించ బోయే పదో తరగతి పరీక్షలను ఎస్ఎస్‌సీ బోర్డు విధానంలోకి మార్చుతూ ఉత్తర్వుల జారీ చేసింది. మూడేళ్ల పాటు కష్టనష్టాలకు ఓర్చుకుని సీబీఎస్ఈ సిలబస్‌కు అలవాటు పడ్డ విద్యార్థులకు తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తీవ్ర నిరాశ, ఆందోళనలోకి నెట్టబడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విద్యా వేత్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, తీవ్రంగా మండిపడుతున్నాయి.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

కార్పొరేట్, ఇతర ప్రత్యేక పాఠశాలల్లోనే సీబీఎస్ఈ సిలబస్ అమలు అవుతుంది. దీంతో పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. ఈ నేపథ్యంలో గత రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇలాంటి బోధన అందించాలన్న సంకల్పంతో చర్యలు తీసుకుంది. అన్ని రకాల వనరులు ఉండి, పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లోనే దీన్ని అమలు చేశారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ బోధన ద్వార చదువుకునే అవకాశం ఉంటుంది. ఆయా విద్యాలయాల పర్యవేక్షణ కేంద్రంలోకి వెళ్తుంది. జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు ఎంతగానే ఉపయోగం, విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు పెంచేలా సిలబస్ ఉంటుంది. విద్యార్థుల ఆసక్తి అభిరుచి గుర్తించి, వివిధ రంగాల్లో వారికి ప్రోత్సహిస్తారు. అవసరం మేరకు సబ్జెక్టు టీచర్లను నియమించారు. ఎంతో లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన బృహత్తర విద్యను కూటమి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టింది. విద్యాసంవత్సరం ప్రారంభైన మూడు నెలల తర్వాత సీబీఎస్ఈ రద్దు నిర్ణయం తీసుకుంది.

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ..

గత ప్రభుత్వం సీబీఎస్ఈ సిలబస్‌ను బోధించేందుకు జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. శిక్షణలోని అనేక మెలుకువలను గ్రహించి విద్యార్థినులకు అర్థమయ్యే రీతిలో బోధనలు సాగిస్తున్నారు. తీరా వ్యవస్థ గాడిలో పడిన తర్వాత కూటమి ప్రభుత్వం సీబీఎస్ఈ సిలబస్‌కు ఎసురు పెట్టింది. దీంతో అకాడమిక్ మధ్యలో నిర్ణయం తీసుకోవడంతో పలువురు ఉపాధ్యాయ వర్గాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల మూడేళ్ల కష్టం బూడిదలో పోసిన పన్నీరులా మారిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 10 పాఠశాలల్లో సుమారు 1,200 మందికి పైగా విద్యార్థులు సీబీఎస్ఈ సిలబస్‌ను అభ్యసిస్తున్నారు.

పేదల వ్యతిరేక ప్రభుత్వం:



ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల విద్యార్థులే చదువుతున్నారు. సీబీఎస్ఈ సిలబస్ రద్దుతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు నష్టపోతారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద విద్యార్థులు పోటీ పరీక్షల్లో వెనకబడి ఉన్నత విద్యకు దూరం అయ్యే అవకాశాలున్నాయి. కూటమి ప్రభుత్వం పేదల వ్యతిరేకిగా మారుతుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచించుకోవాలి.

పందిటి మోహన్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి)

సీబీఎస్ఈ రద్దు సరైంది కాదు:



ప్రభుత్వం పాఠశాలల్లో గత ప్రభుత్వం అమలు చేసిన సీబీఎస్ఈ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడం సరైంది కాదు. పాఠశాలల్లో పేదల విద్యకు విఘాతం కల్గించే విధంగా ప్రభుత్వ నిర్ణయం ఉంది. ప్రస్తుతం నడుస్తు పోటీ విద్యలో, పోటీ ప్రపంచంలో సీబీఎస్ఈ సిలబస్ విద్యార్థులకు ఎంతో అవసరం.

సీహెచ్ పవన్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే లడ్డుపై చంద్రబాబు దుష్ప్రచారం


- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ



అయ్యవారిపల్లెలో నాయకులతో సమావేశమైన ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల

పామూరు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను అమలును ఏమార్చేందుకే తిరుమల లడ్డుపై దుష్ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వైఎస్సార్ సీపీ కనిగిని ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లె, అయ్యన్నకోట నాయకులతో ఆదివారం దద్దాల నారాయణయాదవ్ సమావేశమయ్యారు. మొదట అయ్యవారిపల్లెలో జరిగిన గ్రామ దేవత పోలేరమ్మ పాల పొంగళ్లలో పాల్గొన్నారు. అనంతరం అయ్యవారిపల్లెలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించి స్థానికంగా పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజల పాటు ఘోరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, ఇతర చిరు ఉద్యోగులను మార్చి వారి పొట్టగొడుతున్నారని, ఇలాంటి చర్యలు బాధాకరమన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామ, వార్డు సచివాలయాలద్వారా అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. వలంటీర్లకు రు.10 వేల వేతనం ఇస్తామని చెప్పి వారిని ఇంతవరకు విధుల్లోకి కూడా తీసుకోకపోవడం వారిని మోసం చేయడం కాదా ప్రశ్నించారు. నాలుగు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమయిందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బంది పెడితే సహించేంది లేదని, పార్టీ అందరికీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పీసీపల్లి మండల కన్వీనర్ జి.బొర్రారెడ్డి, భూమిరెడ్డి వెంకటరెడ్డి, ముత్యాల నారాయణరెడ్డి, మూలె రాజశేఖర్‌రెడ్డి, తాతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రవి, కందుల ఉపేందర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి, పుట్టా మాలకొండారెడ్డి, యర్రంరెడ్డి మల్లికార్జునరెడ్డి, తుమ్మా పిచ్చిరెడ్డి, చింతలపూడి గురుస్వామిరెడ్డి, తుమ్మా రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సూపర్ సిక్స్ అమల్లో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కనిగిరి రూరల్: ఎన్నికల ముందు రైతులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి.. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ వ్యవస్థలకు ప్రభుత్వాలు కట్టబెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం పీసీ కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టాయని ఘాటుగా విమర్శించారు. రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని సేకరించి పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను కేంద్రం నిర్వీర్యం చేసిందన్నారు. ఫలితంగా రైతు పండించిన పంటకు పంటకు గిట్టుబాటు ధర లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే రైతు వ్యతిరేక చర్యలు రైతుల ఆత్మ హత్యలను పెంచేలా ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ నేతలు ఎన్నికల ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాల అమలులో పూర్తిగా అలసత్వం వహిస్తోందన్నారు. శ్రీ వారి లడ్డు ప్రసాదంలో అక్రమాలు జరిగితే దోషులను శిక్షించాలే కానీ, మత ఉన్మాదం వైపు ప్రజలను మళ్లించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. వరదలతో సర్వం కోల్పోయిన వరద బాధితులకు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెప్పించి ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సీపీఎం జిల్లా నాయకులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు పిల్లి తిప్పారెడ్డి, జి.శ్రీనివాసులరెడ్డి, పి.నరేంద్ర, ఎస్‌కే బషీరా, కె.లక్ష్మీ, ప్రసన్న, శాంతి కుమారి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

36 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆంజనేయులు

కొండపి(సింగరాయకొండ): మండలంలోని కట్టావారిపాలెంలో మన ఊరి ఆరోగ్య వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 36 మందికి వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో ఒంగోలు దేవి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కంకణాల కృష్ణమోహన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన వారు ప్రతి ఒక్కరూ విధిగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అందరూ ధ్యానం, యోగ వంటివి సాధన చేస్తే ప్రశాంత జీవిం అలవాటు చేసుకోవాలన్నారు. గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ల చెంచు రామయ్య, వీరమోసు మస్తానరావు, మానికొండ వెంకటేశ్వర్లు, ఆరోగ్య భవనం దాత గుంటుపల్లి పద్మావతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

‘నీ తప్పుకు 20 కుటుంబాలు వీధిన పడతాయ్..’



మద్యం మత్తులో ఉన్న డ్రైవర్‌కు వార్నింగ్ ఇస్తున్న ఎస్సై టి.శ్రీరాం

- మద్యం తాగి వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు ఎస్సై కౌన్సెలింగ్

కనిగిరి రూరల్: ‘ పొట్టకూటి కోసం పనికి వెళ్తేందుకు నిన్ను నమ్మి వాహనం ఎక్కారు.. నువ్వేమో.. ఫుల్‌గా మద్యం తాగి వాహనం డ్రైవింగ్ చేస్తున్నావ్.. ఏదైనా చిన్న పొరపాటు జరిగితే నువ్వు ఒక్కడివే కాదు.. నీ వల్ల మరో 20 కుటుంబాలు వీధిన పడతాయి.. ఎన్ని సార్లు చెప్పినా మీరు మారారా.. ? అంటూ పూటుగా మద్యం తాగి టాటా ఏసీ వాహనం నడుపుతున్న ఆటో డ్రైవర్‌కు ఎస్సై టి.శ్రీరాం వార్నింగ్ ఇచ్చారు. పట్టణంలోని ఒంగోలు బస్టాండ్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. పట్టణంలో రౌండ్స్ తిరుగుతున్న ఎస్సై టి.శ్రీరాంకు నిండుగా మహిళా కూలీలతో వెళ్తున్న టాటా ఏసీ వాహనం కన్పించింది. దీంతో వాహనం ఆపిన ఎస్సై టాటా ఏసీ డ్రైవర్‌ను పిలిచారు. అతను పూటుగా మద్యం సేవించి ఉండటంపై ఎస్సై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే కిందికి దిగిన సుమారు 20 మంది మహిళా కూలీల వద్దకు ఆ డ్రైవర్‌ను తీసుకొచ్చి నిలబెట్టాడు.. ఇదిగో మీరే చూడండి . ఇతను ఎంతలా మద్యం తాగి ఉన్నాడో.. మీరంతా వాహనం ఎక్కినందుకు డ్రైవర్‌ను అరవడం లేదు.. పూటుగా మద్యం సేవించి వాహనం నడుపుతున్నాడు. చిన్న పొరపాటు జరిగితే.. మీరంతా అన్యాయమవుతారు. మీరు కూడా వాహనాలు ఎక్కేటప్పుడు.. డ్రైవర్ల పరిస్థితి గమనించి ఎక్కాలంటూ ఎస్సై టీ శ్రీరాం తన దైనశైలీలో హితబోధ చేశారు. మహిళలను వేరు వాహనంలో పనికి వెళ్లాలని సూచించి ఆ డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

టంగుటూరు: టంగుటూరు ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం టంగుటూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా షేక్ అమీర్‌బాషా, నూతన ప్రెసిడెంట్‌గా చుండి రమేష్, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీహరిబాబు, సెక్రటరీగా కిరణ్, జాయింట్ సెక్రటరీగా కోటేశ్వరరావు, సభ్యులుగా నాగరాజు, సుబ్బారావు, ఇతర కార్యవర్గ సభ్యులు మొత్తం 15 మంది ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా కెమెరా సృష్టికర్త డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరులైన ఫొటో, వీడియోగ్రాఫర్స్‌కి నివాళులర్పించి, ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్సును తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. ఒంగోలు ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

175 మందికి గుండె వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ మల్లికార్జునరెడ్డి

పామూరు: మారుమూల ప్రాంతాల్లో పేదల కోసం ఉచితంగా గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్య సేవలందించడం కొనియాడదగినదని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ మల్లంపాటి సునీల్‌కుమార్ అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా పామూరులో రవణమ్మ మెమోరియల్ మల్లికార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం డాక్టర్ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో సునీల్ హార్ట్ అండ్ జనరల్ హాస్పిటల్ కందుకూరు, మల్లికార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ పామూరు వారు సంయుక్తంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 175 మందికి డాక్టర్ సునీల్‌కుమార్ గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ మల్లికార్జున ఎముకలకు సంబంధించి ఉచితంగా పరీక్షలు నిర్వహించి వైద్యం అందించారు. డాక్టర్ కె.క్రిష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన



మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ చైర్మన్, ఈఓ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవ అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మలు వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రుత్వికులు శ్రీనారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తికి, నారాయణస్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం గోశాలలో గోపూజ నిర్వహించారు. అదేవిధంగా నైవేద్యపొంగలితో మేళతాళాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి నైవేద్యంగా పొంగలి సమర్పించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. పూజల్లో పాల్గొన్న యారవ శ్రీనివాసులకు స్వామి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకించి ఐక్యత చాటాలి



మాట్లాడుతున్న బాల గురువయ్య

వెలిగండ్ల: దళితులు వర్గీకరణను వ్యతిరేకించి ఐక్యతను చాటాలని ఏడీపీఎస్ రాష్ట్ర నాయకులు చదలవాడ బాలగురువయ్య , ప్రముఖ న్యాయవాది యర్రజాల బాలనారాయణ అన్నారు. మండలంలోని మరపగుంట్ల, జిల్లెళ్లపాడు గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రవర్ణాలు దళితుల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకుంటున్నారు. రాజకీయ లబ్ధి పొందేదుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మాలల ఐక్యవేదిక నాయకులు కల్వకూరి శాంతరాజు, ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు కొటికల బాలబాదుల్లా, కోటపాటి రమణ, పెనుమాల చిన మాలకొండయ్య, యర్రజాల శేషయ్య, యర్రగుంట్ల కళ్యాణ్ బాలయ్య, పోకూరి చెన్నకేశవులు, యర్రగుంట్ల ప్రసాద్, గొర్రెముచ్చు రమణయ్య, శెట్టి రామచంద్రయ్య, కొటికల కొండయ్య, పెనుమాల బాలచెన్నయ్య పాల్గొన్నారు.

వెలిగొండ మలిదశ పోరాటానికి సమాయత్తం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

పామూరు: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మలిదశ పోరాటానికి సీపీఐ శ్రేణులు సమాయత్తం అవుతున్నాయని ఇందులో భాగంగా అక్టోబర్ నెల 8వ తేదీన మార్కాపురంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. పామూరు 565 జాతీయ రహదారివద్ద నీరుకట్టు మస్తానయ్య ప్రాంగణంలో గత 3 రోజులుగా జరుగుతున్న రాజకీయ జిల్లా శిక్షణా తరగతులు ఆదివారంతో ముగిశాయి. సీపీఐ పార్టీ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి అధ్యక్షతన ఆఖరిరోజు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య మాట్లాడుతూ వర్షాల సమయంలో లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోందన్నారు. జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ పామూరు, పీసీపల్లి మండలాల్లో తలపెట్టిన నిమ్జ్‌లో పరిశ్రమల ఏర్పాటుకోసం ప్రభుత్వంపై పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు భవిష్యత్ పోరాటాలకోసం సిద్ధంగా ఉండాలన్నారు. వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ యాసిన్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, నాసరయ్య పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారి



రోడ్డు అక్రమణలను తొలగిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని రామాలయం వీధిలో ఉన్న పాత శివాలయం ఎదురుగా గల లాడే సాహెబ్ వీధిని కలిపి రోడ్డుకు ఎట్టకేలకు మున్సిపల్ పాలకులు, అధికారులు మోక్షం కల్పించారు. రహదారి ఆక్రమణలపై పలువురి ఫిర్యాదుల మేరకు ఆదివారం రోడ్డు క్లియరెన్స్ చర్యలు చేపట్టినట్లు చైర్మన్ గఫార్ తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ రోడ్లు, కాలువలు ఆక్రమణలు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. సుమారు రెండు దశాబ్దాల నుంచి ఆక్రమణలతో మూసుకుని పోయిన పాత శివాలయం ఎదురుగా ఉన్న రోడ్డుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అంతేగా ఈ రోడ్డు లాడే సాహెబ్ వీధి వరకు ఉండటంతో పట్టణంలోని ప్రధాన సెంటర్ పామూరు రోడ్డు నుంచి చెప్పల్ బజార్ లింకు రోడ్డు మీదుగా త్వరగా బొడ్డు చావిడి సెంటర్‌కు వెళ్లవచ్చని తెలిపారు. ద్విచక్రవాహన దారులకు, ప్రధానంగా పాదా చారులకు ఎంతో ఈ రోడ్డు ఉపయోగం కల్గుతుందని తెలిపారు. దీంతో ప్రధాన రోడ్లలో కొంతమే ట్రాఫిక్ సమస్య పరిష్కారం జరుగుతుందని చైర్మన్ గఫార్ వివరించారు.